ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ ఐడీహెచ్‌ కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు సికింద్రాబాద్‌ తహసీల్దార్‌ పాండు నాయక్‌ను కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, శ్రీకాంత్‌, కిరీటా, రఘునాథ్‌ గౌడ్‌, గోపి, వికాస్‌, నరేష్‌, అనిత తదితరులు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. నల్లపోచమ్మ దేవాలయం సమీపంలో ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వెంటనే అక్కడ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలం అంటూ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు వంశీ, వినయ్‌ క్రిష్ణ, మరియ, ఇందుమతి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాండురంగకు ఓయూ డాక్టరేట్‌


పాండురంగ

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బి. పాండురంగ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందుకున్నారు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డా. రాజశ్రీ పర్యవేక్షణలో నయీ సదీ కే హిందీ ఉపన్యాసోం మే సామాజిక చేతన' అనే అంశంపై పీహెచ్‌డీ పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ పాండురంగను డాక్టరేట్‌తో సత్కరించింది.

ఉత్సాహంగా స్పోర్ట్స్‌ క్విజ్‌


స్పోర్ట్స్‌ క్విజ్‌ విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

లాలాపేట: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్‌ స్పోర్ట్స్‌ కోచింగ్‌ క్యాంప్‌లో భాగంగా సోమవారం సికింద్రాబాద్‌లోని స్విమ్మింగ్‌ పూల్‌ భవనంలో స్పోర్ట్స్‌ క్విజ్‌ కాంపిటీషన్‌ నిర్వహించారు. ఈ క్విజ్‌లో సికింద్రాబాద్‌ నార్త్‌ జోన్‌ నుంచి దాదాపు 40 టీంలు పాల్గొన్నారు. షటిల్‌ ప్లేయర్స్‌ సోమనాథ్‌రెడ్డి, సాయి ప్రణవ్‌లు పాల్గొని ఉత్తమ ప్రతిభచాటి స్పోర్ట్స్‌ క్విజ్‌ విజేతలుగా నిలిచారు. జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్‌ అధికారులు బహుమతులు అందజేశారు. గేమ్స్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌గౌడ్‌, డిప్యూటీ కమీషనర్‌ డాకూ నాయక్‌ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12లోని ఎన్‌బీటీనగర్‌ బస్తీలో బడులు, గుడులు, దవాఖానాలకు గ్రేటర్‌ మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి సీసీ కెమెరాలను పంపిణీ చేశారు. బస్తీలోని ప్రభుత్వ పాఠశాల, పోచమ్మ గుడి, బస్తీ దవాఖానాలకు సోమవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెమెరాలను అందజేశారు.

వైద్యం.. బహుదూరం

- నాడి పట్టే వైద్యుడు లేడు..టెస్టులు చేసే టెక్నీషియన్‌ లేడు
- నాలుగు నెలలుగా రోగుల ఇబ్బందులు..
- ఇదీ బేగంపేట గరీబ్‌నగర్‌ యూపీహెచ్‌సీ దుస్థితి..


ఖాళీగానే ఉన్న మెడికల్‌ ఆఫీసర్‌ కుర్చీ


బేగంపేట పాటిగడ్డ మోడల్‌ మార్కెట్‌ ప్రాంగణంలోని గరీబ్‌నగర్‌ యూపీహెచ్‌సీ

సనత్‌నగర్‌: నాలుగైదు నెలలుగా అక్కడ నాడి పట్టి చూసే వైద్యుడు లేడు. ఇక వైద్యుడు లేడు కదా? అని టెస్టులతో పనేముంటుంది అనుకున్నాడో ఏమో! ల్యాబ్‌ టెక్నీషియన్‌ కూడా అందుబాటులో లేకుండా పోయాడు. ఇదేమిటని వైద్య శాఖ అధికారులను ప్రశ్నిస్తే..ఇక్కడ ఒక్కటే కాదు..చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉందంటూ సమాధానం ఇవ్వడం గమనార్హం. ఆ యూపీహెచ్‌సీ పేరుకు తగ్గట్లుగానే గరీబోళ్లు నివసించే ఈ ప్రాంతంలో వైద్యం కోసం వచ్చే వారికి డాక్టర్‌ రూమ్‌లో ఖాళీ కుర్చీనే దర్శనమిస్తోంది. ఎటూ డాక్టర్‌ ఉండడం లేదు కదా..? వెళ్లి ఏం చేస్తాంలే అంటూ చాలామంది ప్రైవేటు ఆస్పత్రుల బాట తప్పడం లేదు. ఆర్థిక భారం భరించలేని వారు ఎక్కడో సుదూరంలో ఉండే పాల్‌దాస్‌ ఆస్పత్రి వరకు అపసోపాలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. ఇదీ బేగంపేట పాటిగడ్డ మోడల్‌ మార్కెట్‌ ప్రాంగణంలో కొనసాగుతున్న గరీబ్‌నగర్‌ యూపీహెచ్‌సీ పరిస్థితి.

రోజుకు సగటున 60–70 మంది రోగులు..

బేగంపేట డివిజన్‌ పరిధిలో పాటిగడ్డ పరిసర ప్రాంతవాసులకు గరీబ్‌నగర్‌ యూపీహెచ్‌సీ ఒక్కటే ప్రభుత్వ వైద్యశాల. పాటిగడ్డతో పాటు ఎన్‌బీటీ నగర్‌, వికార్‌నగర్‌, ప్రకాష్‌నగర్‌, ప్రకాష్‌నగర్‌ ఎక్స్‌టెన్షన్‌ తదితర బస్తీలకు చెందిన పేద ప్రజలు ఏదైనా సుస్తీ చేస్తే ఇక్కడి ఆస్పత్రికి వస్తుంటారు. ప్రతిరోజూ సగటున 60–70 మంది వరకు రోగులు వివిధ ఆరోగ్య సమస్యలతో వస్తుంటారు. 10 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌ చేయాలని గతంలో ప్రతిపాదనలు కూడా రూపొందించారు. అప్‌గ్రేడ్‌ మాట దేవుడెరుగు..కనీసం ఇప్పుడు జ్వరం వస్తే చూడడానికి డాక్టర్‌ కూడా లేడు. ఎవరైనా ఆస్పత్రికి వచ్చి మందు బిళ్లలు అడిగితే ఇస్తున్నారు. డాక్టర్‌ ప్రిస్క్రిప్షన్‌ లేకుండానే కేవలం మందు బిళ్లలు ఇచ్చి పంపిస్తుండడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ల్యాబ్‌ టెక్నీషియన్‌ లేక ఖాళీగా దర్శనమిస్తున్న ల్యాబ్‌

ఆ మందులతో తగ్గితే ఓకే.. లేకపోతే పరిస్థితి ఏమిటో అర్థంకాకుండా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రక్త పరీక్షలూ నిలిచిపోయే..

కనీసం రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించుకుందామంటే టెక్నీషియన్‌ కూడా అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. డయాబెటిక్‌ ప్రొఫైల్‌, థైరాయిడ్‌ ప్రొఫైల్‌, లివర్‌ ఫంక్షన్‌ టెస్ట్‌, రీనల్‌ ఫంక్షన్‌ టెస్ట్‌, లిపిడ్‌ ప్రొఫైల్‌, సిరం ఎలక్ట్రోలైట్స్‌లతో పాటు సీబీపీ, మైక్రోబయాలజీ టెస్టులు ఇక్కడ చేస్తుంటారు. ల్యాబ్‌ టెక్నీషియన్‌ కూడా ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో తెలియక ఇక్కడికి వచ్చి వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. వైద్యుడు ప్రిస్క్రిప్షన్‌ బట్టి రక్త పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ వైద్యుడే లేకపోవడంతో ఇక టెక్నీషియన్‌ కూడా రావడం ఎందుకు దండగ అని రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎప్పుడైనా ఒకసారి వచ్చి కేవలం బీపీ, షుగర్‌ వంటి టెస్టులు చేసి వెళ్లిపోతుంటారని పేర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పర్మినెంట్‌గా వైద్యుడిని నియమించి ల్యాబ్‌ పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా ఏసీ బస్‌ షెల్టర్‌



లాలాపేట: లక్షల రూపాయలు వెచ్చించి తార్నాక హుడా కాంప్లెక్స్‌ వద్ద ఏర్పాటు చేసిన మోడ్రన్‌ ఏసీ బస్‌ షెల్టర్‌ నిరుపయోగంగా మారింది. అందులోని బెంచీలు, ఏసీలు, ఇతర పరికరాలు సైతం మాయమయ్యాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో తార్నాక హుడా కాంప్లెక్స్‌ ముందు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడ్రన్‌ ఏసీ బస్‌ షెల్టర్‌ను ప్రారంభించాలని అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ ప్రభుత్వం మారిపోవడంతో దానిని పట్టించుకునే వారు లేరు.

అసలు అక్కడ ఎందుకు ఏర్పాటు చేశారో?

తార్నాక లోని ఆర్టీసి హాస్పిటల్‌కు సమీపంలో బస్‌స్టాప్‌లు ఉండగా తార్నాక హుడా కాంప్లెక్స్‌ ముందు మోడ్రన్‌ బస్‌ షెల్టర్‌ను దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో దాని సేవలను ప్రయాణికులు వినియోగించుకోలేకపోతున్నారు. కేవలం ప్రకటనలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకోడానికి మాత్రమే ఉపయోగపడుతోంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌


కంటోన్మెంట్‌: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. మారేడ్‌ పల్లిలోని మల్టీ పర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌ లో మెప్మా అధికారులు, బ్యాంకు మేనేజర్లు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంలో భాగంగా కంటోన్మెంట్‌ మహిళలను కోటీశ్వరులను చేయడమే తన లక్ష్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సక్రమంగా వినియోగించుకుంటే విజయం సాధించవచ్చని, సలహాలు, సూచనలు అందించడానికి అధికారులతో పాటు తాను కూడా ఎప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. కార్యక్రమంలో మెప్మా పట్టణ మిషన్‌ కోఆర్డినేటర్‌ ప్రకాశ్‌, అసిస్టెంట్‌ డిస్ట్రిక్ట్‌ మిషన్‌ కో ఆర్డినేటర్‌ నర్సింహులు పాల్గొన్నారు.

నాలా పూడిక తొలగింపు వేగవంతం చేయండి


నాలా డీసిల్టింగ్‌ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ టి.మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్‌: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నాలా డీసిల్టింగ్‌ పనులను వేగవంతం చేయాలని బేగంపేట కార్పొరేటర్‌ టి.మహేశ్వరిశ్రీహరి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. బేగంపేట వద్ద కూకట్‌పల్లి నాలా డీసిల్టింగ్‌ పనులను అధికారులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. శాస్త్రీయబద్ధంగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. తీసిన పూడికను అక్కడే పడేయడం వల్ల వర్షాలకు మళ్లీ నాలాలో కలుస్తుందని, ఎప్పటికప్పుడు పూడికను తరలించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ విభాగం అధికారులతో పాటు బీఆర్‌ఎస్‌ నేతలు రఘునాథ్‌, రామచంద్ర, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



వెంగళరావునగర్‌: బీఆర్‌ఎస్‌ హయాంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ చెక్కులను అందజేయడమే కాకుండా ప్రజలకు నేటికీ తాము అండగా ఉంటున్నామని వెంగళరావునగర్‌ కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ తెలిపారు. వెంగళరావునగర్‌ డివిజన్‌తో పాటు యూసుఫ్‌గూడ,, శ్రీనగర్‌కాలనీ డివిజన్‌కు చెందిన పలువురు గతంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకాల కింద లబ్ధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్పొరేటర్‌ ఆయా లబ్ధిదారులకు చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అప్పటి ప్రభుత్వం వాటిని విడుదల చేసిందని, వివిధ కారణాల వల్ల ఏడాదిన్నరగా తహసీల్దార్‌ కార్యాలయంలో నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులందరికీ చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు. రూ. 400 మందికి ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున పంపిణీ చేశామన్నారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్‌ రాజ్‌కుమార్‌, ఖైరతాబాద్‌ తహసీల్దార్‌ నయీముద్దీన్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు విజయ్‌కుమార్‌, మాజీ కార్పొరేటర్‌ శ్యాంరావు, పూజారి బాలు, సత్యనారాయణ, బాలు రజక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: జూన్‌ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ పిలుపునిచ్చారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సనత్‌నగర్‌ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్‌ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. జూన్‌ 2న బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యాలయంలో ఎంతో ఘనంగా నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో సనత్‌నగర్‌ కార్పొరేటర్‌ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ మల్లికార్జున్‌గౌడ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నేత సైకిల్‌ స్టాండ్‌ నర్సింహ మృతి


నర్సింహ

బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ బోలక్‌పూర్‌లోని బీఆర్‌ఎస్‌ నాయకులు సైకిల్‌ స్టాండ్‌ నర్సింహ (68) మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నర్సింహ సోమవారం ఉదయం ఆరోగ్యం క్షీణించడంతో మరణించాడు. నర్సింహ మృతితో బోలక్‌పూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయన నివాసానికి వచ్చి పార్థీవ శరీరంపై పుష్ప గుచ్ఛాలుంచి నివాళులర్పించారు. బాపూజీనగర్‌ మొరంబండ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళలకు అండగా కాంగ్రెస్‌ ప్రభుత్వం

రహమత్‌నగర్‌: పేద మహిళల జీవితాల్లో షాదీముబారక్‌, కల్యాణలక్ష్మి పథకాలు వెలుగులు నింపుతున్నాయని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యుడు, రహమత్‌నగర్‌ కార్పొరేటర్‌ సి.ఎన్‌.రెడ్డి, నగర కాంగ్రెస్‌ నాయకురాలు హబీబా సుల్తానా అన్నారు. రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్‌లకు చెందిన 280 మంది లబ్ధిదారులకు సోమవారం వారు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖైరతాబాద్‌ తహసీల్దార్‌ నయీముద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

రుణం ఇప్పిస్తామంటూ రూ.50 వేలు టోకరా

అమీర్‌పేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన ఇద్దరు వ్యక్తులు రుణం ఇప్పిస్తామని చెప్పి ఓ మహిళ వద్ద రూ.50వేలకు టోకరా వేశారు. ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట పోలీస్‌లైన్‌గస్‌ బజార్‌కు చెందిన శ్రీ థెరిస్సా డిక్రుజ్‌ రూ.50 లక్షల రుణం అవసరం పడటంతో రుణం కోసం ఆన్‌లైన్‌లో సర్చ్‌ చేసింది. జడ్డారెడ్డి అనే వ్యక్తి పరిచయమై రుణం ఇప్పిస్తానని చెప్పాడు. రుణం పొందాలంటే కొన్ని పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి దాస్‌ అనే వ్యక్తితో కలిసి మహిళ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న పత్రాలతో పాటు ఆమెను వెంట తీసుకుని అమీర్‌పేటకు వచ్చారు. హరి దోశ హోటల్‌ వద్ద ప్రాసెసింగ్‌ కోసం రూ.50 వేలు కావాలని అడుగడంతో డబ్బులు ఇచ్చింది.తర్వాత ఎన్ని సార్లు ఫోన్‌ చేసినా స్విఛాఫ్‌ చేసి ఉండటంతో మోస పోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తింపు లేని జూనియర్‌ కాలేజీల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: గుర్తింపు లేని జూనియర్‌ కాలేజీల్లో ప్రవేశాలపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రవేటు, కార్పొరేట్‌ కాలేజీలకు గుర్తింపు లేకున్నా ఇష్టారాజ్యాంగా వ్యవరిస్తూ ఇంటర్‌ బోర్డు అనుమతి రాకముందు మోసపూరిత ప్రకటనలతో విద్యార్థులను చేర్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. అక్రమ ప్రవేశాలపై అధికారులు స్పందించి గుర్తింపులేని జూనియర్‌ కాలేజీల నిర్వహకుల పై పీడీ యాక్టు కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు.

కారును ఢీకొన్న బైక్‌: యువకుడికి గాయాలు

వెంగళరావునగర్‌: పార్కింగ్‌ చేసిన కారును ఓ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కారు డ్యామేజ్‌ అయిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మల్కాజ్‌గిరికి చెందిన డి.సంతోష్‌ ఆదివారం మధ్యాహ్నం 12.30కు కృష్ణకాంత్‌పార్క్‌ వద్ద కారు పార్క్‌ చేసి, సాయంత్రం తిరిగి తన వాహనం వద్దకు వచ్చాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వెనుక నుంచి వచ్చి కారును ఢీ కొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారునికి దెబ్బలు తగిలాయి. స్థానికులు 108 పిలిపించి యువకుడిని ఆస్పత్రికి తరలించారు. తన కారును డ్యామేజ్‌ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సంతోష్‌ మధురానగర్‌ పీఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల దారి కోసం..

ప్రధానోపాధ్యాయుడి దీక్ష

జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు నిరసన




హెచ్‌ఎంకు మద్దతుగా దీక్షలో పాల్గొన్న స్థానిక నాయకులు

సికింద్రాబాద్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం అంతటా బడిబాటకు సిద్ధమవుతున్న తరుణంలో సికింద్రాబాద్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ బడికి బాట చూపాలంటూ సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు బైటాయించారు. వివరాలు... సికింద్రాబాద్‌ పరిధిలోని దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తూర్పు వైపున లోగడ మైలార్‌గడ్డ మీదుగా వెళ్లేందుకు 40 చదరపు అడుగుల దారి ఉండేది. దూద్‌బావి బస్తీ నుంచి మరో కాలిబాట కూడా అందుబాటులో ఉంది. పదేళ్ల క్రితం మైలార్‌గడ్డ వైపున్న ప్రధాన మార్గాన్ని కొందరు మూసివేసి కారుషెడ్‌ను నిర్మించుకున్నారు. అప్పట్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టినప్పటికీ ఫలితంలేకుండాపోయింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కాలిబాట గుండానే పదేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే బడిలోని ఒక గదిలో అంగన్‌వాడీ సెంటర్‌ కూడా కొనసాగుతోంది. అయితే ఈ దారి గుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ సెంటర్‌కు సరుకులు తెచ్చేందుకు వాహనాలు వచ్చే అవకాశం కూడా లేదు. సరుకులను భుజాన ఎత్తుకుని కాలిబాట గుండా తీసుకువచ్చే దుస్థితి నెలకొంది.

జీహెచ్‌ఎంసీ ముందు బైటాయింపు....

పాఠశాల రహదారిని పునరుద్ధరించాలని కోరుతూ పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఉపాధ్యాయులు, బస్తీవాసులు, సీపీఐ నాయకులు వినతిపత్రాలు అందించారు. అధికారులు నేడు రేపు అంటూ కాలయాపన చేస్తూ రహదారిని మూసివేసిన వారివైపే మొగ్గు చూపుతున్నారని సీపీఐ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికారుల వైఖరికి నిరసనగా ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఆయనకు సికింద్రాబాద్‌ సీపీఐ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్‌, నాయకులు మద్దతు తెలిపారు. వారంతా ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రధానోపాధ్యాయుడు, సీపీఐ నాయకులతో చర్చలు జరిపారు. వారం రోజుల్లో పాఠశాల దారి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

కదలిక లేని కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం

- రెండేళ్లుగా నిలిచిన పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నిలిచిపోయిన కమ్యూనిటీహాల్‌ నిర్మాణ పనులు

పద్మారావునగర్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ జయనగర్‌ కాలనీలోని నూతన కమ్యూనిటీహాల్‌ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యాయి. రెండు సంవత్సరాలుగా కమ్యూనిటీహాల్‌ పనులు ముందుకు సాగడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు నిర్లిప్తత కమ్యూనిటీహాల్‌ పనులు నిలిచిపోయాయి. ఎంత కాలం ఈ పనులు అంటూ ప్రశ్నిస్తున్నారు.కమ్యూనిటీహాల్‌ నిర్మాణం పూర్తికాకపోవడంతో తాము శుభకార్యాలకు ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాళ్లను ఆశ్రయించాల్సి వస్తుందని స్థానికులు వాపోయారు. రూ. 10లక్షల రూపాయలతో నిర్మించనున్న ఈ భవనాన్ని గతంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ ప్రారంభించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా.....

అసంపూర్తిగా ఉన్న ఈ కమ్యూనిటీహాల్‌ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి అయితే మందు బాబులు ఈ భవనాన్ని అడ్డగా మార్చుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే వారిపై గొడవలకు దిగుతున్నారని వాపోయారు.

పనులను వెంటనే ప్రారంభించాలి



కమ్యూనిటీహాల్‌ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి. కమ్యూనిటీ హాల్‌ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేట్‌ ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

– ఎల్‌. వెంకటేషన్‌ రాజు

ఇబ్బంది పడుతున్నాము....



నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ముఖ్యంగా శుభ కార్యాలు చేసుకోవడం కష్టతరంగా మారింది. వెంటనే అధికారులు పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

– పార్శీ మహేష్‌